టీడీపీకి రోజులు దగ్గరపడ్డాయి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవప్పూరు: టీడీపీకి రోజులు దగ్గరపడ్డాయని, ఈ విషయం ప్రజల్లో స్పష్టంగా కనపడుతోందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం ప్రజాసంక్షేమ పాదయాత్ర మూడో రోజు జూటూరులో ప్రారంభమై జోడిధర్మాపురం, వెంగంపేట, నరసాపురం, పెండేకల్లు వరకు సాగింది. యాత్రకు ప్రతి గ్రామంలో అధి కసంఖ్యలో మహిళలు తరలివచ్చి ఎమ్మెల్యేకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జేసీ సోదరులు ప్రజల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయారని, మరోవైపు తమ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడడంతో ఇంతటి ప్రజాదరణ చూపిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన అంజి గూర్చి ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు వివరించగా ఎమ్మెల్యే తన వంతు సాయంగా ఆ కుటుంబానికి స్థానిక నాయకుల చేతుల మీదుగా రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. తాను ప్రతిపక్షనాయకుడిగా ఉన్న సయమంలో పెండేకల్లు ప్రాజెక్టు గండిపడిందని తెలియగానే అక్కడికి పరిశీలించడానికి వెళ్లానన్నారు, గండి ఎందుకు పడిందని అక్కడి అధికారులను ప్రశ్నించగా ఎలుకలు కన్నం పెట్టాయని సమాధానం చెప్పడం విడ్డూరంగా అనిపించిందన్నారు. జేసీ సోదరులు ఏ అభివృద్ధి పనులు చేపట్టినా నాసిరకంగా చేపట్టడడం వారి జేబులు నింపుకోవడం వారికి అలవాటుగా మారిందన్నారు. నియోజక వర్గంలోని ప్రజలకు జేసీ సోదరుల నుంచి ఎలాంటి సమస్య వచ్చినా తాను ముందుగా ఉండి జేసీ సోదరులతో పోరాడటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీలు రామిరెడ్డి, పప్పక కళావతి, ఎంపీటీసీలు నాగవేణి, శంకరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్నాథరెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, నరసాపురం రామాంజులరెడ్డి, రామచంద్ర (కాశీ) పవన్, పెండేకల్లు రామాంజుల రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాగలింగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రజాసంక్షేమ యాత్ర శుక్రవారం పెండేకల్లు నుంచి కుమ్మెత, సుంకేసులపల్లి, అత్తిరాలదిన్నె, కొట్టాలపల్లి వరకు సాగనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



యాత్రకు భారీగా తరలివచ్చిన మహిళలు,కార్యకర్తలు

ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోయడమే జేసీ సోదరుల నైజం

పెద్దవప్పూరు: తమ ఉనికిని కాపాడుకోవాలంటే ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోయడమే జేసీ సోదరుల నైజమని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మూడో రోజు ప్రజాసంక్షేమయాత్రలో భాగంగా నరసాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏనాయకుడికైనా ప్రజలు బాగుండాలి అందులో తాముండాలని భావిస్తారన్నారు. అయితే ఎవరు బాగుపడినా తమ పెత్తనం ఎక్కడ దెబ్బతినకూడదని భావించి అన్నదమ్ములిద్దరూ చెరోవైపు గ్రామాల్లో వర్గ సమస్యలు సృష్టించమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారిపాలనలో ఏకంగా పోలీస్‌స్టేషన్లకే తాళం వేయించిన నీచ సంస్కృతి చరిత్రలో వారికే దక్కుతుందన్నారు. ఏదైనా పనిమీద వారి ఇంటికి వెలితే అటు అధికారులైనా ఇటు ఆపార్టీ నాయకులైనా చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి ఉందని గుర్తు చేశారు. 2019 ఎన్నికలకు ముందు ఈ విషయాన్ని గుర్తించిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలాగైనా వారి మెడలు వంచాలని భావించే తనకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన ఈమూడున్నరేళ్ల పాలనలో ఏగడపకు వెళ్లినా పార్టీలనే భేదభావం లేకుండా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారన్న విషయాన్ని గుర్తించిన జేసీ వర్గీయులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు.

శ్రీ కృష్ణాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎంపీ రంగయ్య

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ మందిరంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రెండు రోజులుగా శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. ఆలయానికి వచ్చిన ఎంపీ రంగయ్యకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎంపీకి తీర్థ ప్రసాదాలను అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, గురుప్రసాద్ యాదవ్, రాముయాదవ్, సుధాకర్, శివయ్య, సురేష్, వెంకటరాముడు, ఓబుళప్ప పాల్గొన్నారు.

శివాలయంలో హుండీల ధ్వంసం

పెద్దవడుగూరు : చింతలచెరువు శివారులోని శివాలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను ధ్వంసం చేశారు. గ్రామస్తుల వివరాల మేరకు..బుధవారం సాయంత్రం అర్చకుడు వీరేష్ ఆలయానికి తాళం వేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి రెండు హుండీలను ధ్వంసం చేశారు. అయితే ఇటీవల హుండీల్లో కానుకలను నిర్వాహకులు తీసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

క్లుప్తంగా

ఓటర్లు స్లిప్పుల పంపిణీ

గార్లదిన్నె: రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులు గురువారం అధికారులు గ్రామ సచివాలయాల్లో ఓటర్లకు పంపిణీ చేశారు. ఈసం దర్భంగా తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ మండలంలో పట్టభద్రులు ఓటర్లు 1409, ఉపాధ్యాయ ఓటర్లు 43 మంది ఉన్నారన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఓటరు స్లిప్పులు అందుబాటులో ఉన్నాయన్నారు.

పెద్దవడుగూరు : ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తహసీల్దార్ ఈరమ్మ గురువారం ఓటర్లు గా నమోదు చేసుకున్న వారికి ఓటర్ స్లిప్ లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు 42 మంది, పట్టభద్రులు 904 మంది దాకా ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లకు రెవెన్యూ సిబ్బంది ద్వారా ఓటర్ స్లిప్‌లను అందజేస్తున్నామన్నారు. ఓటర్లు ఎవరికైనా స్లిప్ రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

గుంతకల్లుటౌన్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో 100 మంది బాలింతలకు చిన్నారుల దుస్తులను అందజేశారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, వైద్యురాలు సుజాత చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు త్రిస్లాబన్సాలీ, సభ్యులు విజయ, శాంత, రేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్‌లో సత్తా



చెస్ రేటింగ్ సాధించిన వెంకటకృష్ణ సుధీంద్ర, అస్మిత అనిమితో కోచ్ సురేంద్ర

తాడిపత్రి టౌన్: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, ఫిడే సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్స్ జాబితాలో తాడిపత్రి పట్టణానికి చెందిన సముద్రాల వెంకట కృష్ణ సుధీంద్ర, అస్మిత అనిమి చోటు దక్కించుకున్నారు. స్టాండర్డ్ విభాగంలో సుధీంద్రకు 1,132 పాయింట్లు, ర్యాపిడ్ విభాగంలో 1,276 పాయింట్లు వచ్చాయి. అలాగే అస్మితకు స్టాండర్డ్ విభాగంలో 1,056 పాయింట్లు దక్కాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను కోచ్ సురేంద్ర అభినందించారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న పశు వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేపట్టారు. పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ వారు సంయుక్త కార్యక్రమం ఏర్పాటు చేశారు. రేబీస్ వ్యాధి నియంత్రణలో భాగంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించామని, త్వరలో పట్టణంలో ఉన్న వీధికుక్కలకు కూడా వ్యాక్సిన్ వేయిస్తామని కమిషనర్ బండిశేషన్న తెలియజేశారు. పెంపుడు కుక్కలు కలిగిన యజమానులు తప్పనిసరిగా మున్సిపాల్టీ ద్వారా లైసెన్సు పొందాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్

గుత్తి రూరల్: లచ్చానుపల్లి వలంటీర్ సుధాకర్ కర్నూలుకు వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేశాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తలారి సుంకమ్మ కిడ్నీ సమస్యతో కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సుధాకర్ దాదాపు 200 కి.మీ దూరం వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్‌ను సర్పంచ్ మజ్జిగ గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ స్థానానికి పోటీచేస్తున్న ఎం.వీ.రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నైరుతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యరంగాల అభివృద్ధికి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు పడాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎండీ.ఖలీల్, పార్టీ నాయకులు వంశీయాదవ్, గఫార్, అశోక్, పవన్, ఉషారాణి, జయ, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ స్కూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గుంతకల్లు మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, గ్రామ సచివాలయ కన్వీనర్లు విజ్ఞప్తి చేశారు. గురువారం కసాపురం, దోసలుడుకి గ్రామ సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, యోగానందరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వినోద్‌కుమార్, సాయికుమార్‌రెడ్డి , స్టూడెంట్ యూనియన్ నేత వంశీ యాదవ్ పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ స్కూలులో గురువారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, పట్ట భద్రుల అభ్యర్థి రవీంద్రారెడ్డి , కో కన్వీనర్ వెన్నపూస చెన్నకేశవరెడ్డి, నాయకుడు రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి కొల్లాగయ్య ఉత్సవాలు



కొల్లాగయ్య స్వామి

శింగనమల: నాయనవారిపల్లి గ్రామంలో ఈనెల 6 నుంచి కొల్లాగయ్య, గంపమల్లయ్య స్వామి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు వడ్ల రంగస్వామి తెలిపారు. కొల్లాగయ్య స్వామి 365 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. 6, 7 తేదీల్లో స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే 8వ తేదీ రాత్రి గ్రామంలో స్వాములను ఊరేగిస్తామన్నారు. అదే రోజు రాత్రి కడవ పూజ, భజనలు ఉంటాయని పేర్కొన్నారు.

7 నుంచి గ్రామీణ పోటీలు..

ఉత్సవాల్లో భాగంగా 7వ తేదీ మోటారు సైకిల్ స్లో పందెం, ట్రాక్టర్ రివర్స్ పందెం నిర్వహిస్తామని, తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఉట్ల పందెం ఉంటుందని, తొలి ఇద్దరు విజేతలకు నగదు బహుమతి అందిస్తామన్నారు.

8న రాతిదూలం లాగుడు పోటీలు

ఉదయం 8గంటలకు రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో విజేతలకు మొదటి బహుమతి రూ.60,116ను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి , ఆలూరు సాంబశివారెడ్డి, ద్వితీయ బహుమతిని రూ. 50,116ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, తృతీయ బహుమతి రూ.40,116లను, ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చాములూరు హరిత రాజగోపాల్, నాలుగో బహుమతి రూ. 30,116లను వెంకటరమణ, ఐదవ బహుమతి రూ. 20,116లను మనోజ్‌రెడ్డి, ఆరవ బహుమతి రూ.10116 లను సాకే నాగేంద్ర, ఏడవ బహుమతి రూ.6,116లను డీలరు ఆదినారాయణ అందిస్తారని నిర్వాహకులు వివరించారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

గుంతకల్లుటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ సిలిండర్‌ను నెత్తిపై పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్యుల నడ్డీ విరిచేలా కేంద్ర ప్రభుత్వం పెనుభారాలను మోపుతోందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ సర్కారును గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని చెప్పారు. ఐద్వా నేతలు వన్నూరమ్మ, శారద, మాబుబీ, గిరిజమ్మ, హుసేనమ్మ, సీఐటీయూ నాయకులు మారుతి, తిమ్మప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

శింగనమల: నాగులగుడ్డం తండా టీడీపీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఆగ్రామ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను టీడీపీ మద్దతుదారులే గెలుపొందారు. ఇద్దరూ మహిళలే కావడంతో వారి భర్తలే పాలన వ్యవహారాలు చూస్తున్నారు. మండల స్థాయి గ్రూపుల్లో సర్పంచ్ ఒకవైపు, ఎంపీటీసీ మరోవైపు చేరిపోయారు. గ్రామంలో గత పది రోజుల నుంచి నీటి సమస్య నెలకొంది. దీంతో ఎంపీటీసీ వర్గీయులు మండల నాయకుడి సాయంతో ట్రాక్టర్‌తో నీరు తోలిస్తున్నారు. దీనిపై గురువారం సోషల్ మీడియాలో ఆ నాయకుడిని పొగుడుతూ పోస్టు చేశారు. దీంతో సర్పంచ్ వర్గీయులు మండల నేత విమర్శిస్తూ పోస్టు చేశారు. దీనితో ఎంపీటీసీ వర్గీయులు సర్పంచ్ వర్గీయులను విమర్శిస్తూ పోస్టు చేశారు. మినరల్ వాటర్ ట్యాంక్‌కు ఇచ్చిన రూ.2 లక్షలు ఏం చేశారని సర్పంచ్ వర్గీయులను ప్రశ్నించారు. దీంతో పంచాయతీలో రెండు వర్గాల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఇదేవిధంగా శింగనమల మండలంలోని ప్రతి గ్రామంలోను గ్రూపులుగా విడిపోయారు. ఈగ్రూపులకు మండల స్థాయి నెలకొన్న నాయకుల పంచన చేరారు. మండలంలోని ప్రతి గ్రామంలోను టీడీపీ నేతలు గ్రూపులుగా మారారు. శింగనమల మండలంలో బండారు శ్రావణి, డేగల కృష్ణమూర్తి, దండు శ్రీనివాసులు, ఎంఎస్ రాజు గ్రూపులుగా తయారయ్యారు. చివరకు పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా ఆ గ్రూపులకు చెందిన వారే పాల్గొనడం గమనార్హం.

గార్లదిన్నె, కల్లూరు మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలి

గార్లదిన్నె: గార్లదిన్నె, కల్లూరు మీదుగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు.గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు గ్రామంలోకి రాకుండా బైపాస్‌లో వెళ్తుండడంతో విద్యార్థులు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యుత్ స్తంభాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సమస్యల పరిష్కరించాలని కోరారు. అనంతరం మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదవి వినిపించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంక టలక్ష్మి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, ఎర్రమ్మ, కోఆప్షన్ మెంబర్ బాబా యూనీస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్ధంతి సభ వాయిదా

అనంతపురం కల్చరల్: ఈనెల 5న ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించాల్సి ఉన్న సింగమనేని వర్ధంతి సభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని సింగమనేని స్మారక కమిటీ ప్రతినిధులు ఎస్‌ఎం బాషా, డాక్టర్ ప్రగతి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ రాజా, ఈఓ ఆర్‌డీఓ బాషా, ఎంఈఓ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగంపై పట్టభద్రులకు వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీల ద్వారా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశమైన అధికారులు

నేడు ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన

శింగనమల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఓటర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నిర్మలా కుమారి తెలిపారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లు, ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం భవనంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు వినియోగంపై గ్రాడ్యుయేట్ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఈనెల 6న కల్లూరులో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విశ్రాంత గ్రామ సెక్రటరీపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ అధికారులు

గుత్తి: కొంత కాలంగా విశ్రాంత గ్రామ సెక్రటరీ రమేష్ రెడ్డి తమను ఆర్టీ యాక్ట్ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడని, ప్రశ్నించిన అధికారులను నానా దుర్భాషలాడుతున్నాడని గుత్తి మున్సిపల్ అధికారులు సీఐ వెంకటరామిరెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన రిటైర్డ్ గ్రామ కార్యదర్శి రమేష్ రెడ్డి తరచూ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అనవసరమైన, వివరాలు ఇవ్వడానికి సాధ్యం కాని వాటిని ఆర్టీఐ యాక్ట్ కింద వివరాలు ఇవ్వాలని ఉద్యోగులను అడుగుతున్నాడు. కొన్ని రోజులు క్రితం టీపీఎస్ అబ్దుల్ సత్తార్‌ను మరో మహిళా ఉద్యోగితో అకారణంగా గొడవకు దిగాడు. ఇలా తరచూ ఏదో ఒక అంశంపై ఆర్టీఐ యాక్టు కింద వివరాలు ఇవ్వాలని అదీ తక్షణమే ఇవ్వాలని అడుగుతూ ఇబ్బందులకు, వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విసిగి వేసారి పోయిన మున్సిపల్ అధికారులందరూ గురువారం మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, టీపీఎస్ అబ్దుల్ సత్తార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, మేనేజర్ ఇమామ్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లి రమేష్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

గార్లదిన్నె: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి పేర్కొన్నారు.గురువారం మండల కేంద్రం స్థానిక కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సాహించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గర్భస్థ లింగ నిర్ధారణ నివారణ చట్టం, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, పోషకాహారం, ఆరోగ్య విద్య, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నాగమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమి

పెద్దవడుగూరు : ప్రతి ఒక్కరూ మహిళల సంక్షేమానికి కృషి చేయాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో జాతీయ మహిళా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలని కోరారు. హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ చిట్టితల్లి, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ శృతి, ఏఎన్ఎం సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మహిళా చట్టాలపై అందరూ అవగాహన కల్గి ఉండాలని వైద్యుడు శివసాయి తెలిపారు. గురువారం అంతర్జాతీయ మహిళా వారోత్సవంలో భాగంగా కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాల్యవివాహాలు, దిశ చట్టం, సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగ నిష్పత్తి , ఫోక్సో యాక్ట్, గర్భస్థ పిండ లింగనిర్ధారణ వంటి వాటిపై వివరించారు. ప్రత్యేకాధికారి మాధవి, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, సీఈఆర్టీలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోటవీధిలో బోరు ఏర్పాటు

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీ(18వ వార్డు)లో గురువారం మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ అధికారులు నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్‌చంద్ర భూమి పూజ చేసి బోరు ఏర్పాటు చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు బిందె వరలక్ష్మి, పద్మలతరెడ్డి, కౌన్సిలర్ అశ్వరాముడు, వార్డు ఇన్‌చార్జ్ చిన్న మారెన్న, పట్టణ కన్వీనర్ పీరా, నాయకులు షఫి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

పుట్లూరు: మడుగుపల్లి గ్రామంలో గురువారం జేసీబీ తగిలి 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్న మూడు స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో స్థానిక రైతులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ముమ్మరంగా వ్యాక్సినేషన్

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లి, ఆరవేడు గ్రామాల్లో గురువారం పశువైద్య సిబ్బంది పశువులు, గొర్రెలు, మేకలకు గాలికుంటు టీకాలను వేశారు. పెద్దమల్లేపల్లిలో 171 మూగజీవాలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరాముడు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

యాడికి: స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓ కాశెప్ప గురువారం దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్, రొలేటర్, సీపీ చైర్, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు రంగస్వామి రెడ్డి, నాగలక్ష్మి, పాఠశాల సహాయకులు ఇంతియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నరసమ్మ(ఫైల్)

గుత్తి: దాసరి కాలనీకి చెందిన నరసమ్మ(102) గురువారం మృతి చెందింది. నరసమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో ఇంటిలోనే తుది శ్వాస విడిచింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు ఉన్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు నాగరాజు

శింగనమల: మండలంలోని సలకంచెరువ్వులో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నాగరాజు(38)కు రెండెకరాల పొలం ఉంది. దీనికితోడు రెండెకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. పంటలు చేతికి రాకపోవడంతో దాదాపు రూ.10 లక్షలదాకా అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలోనని మధనపడుతుండేవాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంపుతరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

నార్పల: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రాముడు భార్య లక్ష్మీదేవి(32) కుటుంబసమస్యలు, అనారోగ్యంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈక్రమంలో బుధవారం తమ పొలంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన భర్త రాముడు ఆమెను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. చికిత్స ఫలించకపోవడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు.

తాగునీటి ట్యాంకు పరిశీలన

పుట్లూరు: ఆదర్శ పాఠశాల వద్ద ఉన్న తాగునీటి ట్యాంకును గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి, సర్పంచ్ ఓబుళేసు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం కింద గూడూరు వద్ద ఉన్న సంప్ నుంచి పుట్లూరులోని తాగునీటి ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేసి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.